


రంజాన్ వేళలు
ఇఫ్తార్ 6:27 ఆదివారం
సహర్ 5:09 సోమవారం



న్యూస్ బాక్స్

మహనీయుల ఫొటోలు పెట్టకుంటే మరో ఉద్యమం

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు

సిరిసిల్ల టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ బీజేపీ ప్రభుత్వం తొలగించిన మహనీయుల ఫొటోలను పెట్టకుంటే మరో ఉద్యమం తప్పదని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు అన్నారు. ఫొటోలను తొలగింపును నిరసిస్తూ శనివారం అఖిలపక్షం, ప్రజా సంఘాల నాయకులు సిరిసిల్ల పట్టణం పాతబస్టాండ్ దామోదర సంజీవయ్య విగ్రహం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిరసన ర్యాలీని చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ మహనీయులైన అంబేద్కర్, భగత్‌సింగ్ ఫొటోలను ముఖ్యమంత్రి కార్యాలయంలో పెట్టి భేషరతుగా ప్రభుత్వం క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు జాతీయ కార్యదర్శి రాగుల రాములు, సీపీఐ నాయకుడు మీసం లక్ష్మణ్, మహిళలు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

వీర్నపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రెడ్డబోయిన గోపిని వీర్నపల్లి మండలం రంగంపేట ముదిరాజ్ సంఘం సభ్యులు శనివారం గజమాలతో సన్మానించారు. అనంతరం మద్దిమల్ల గ్రామంలో ముదిరాజ్ సంఘం సభ్యులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముదిరాజ్ కులస్థుడు ఉన్నత స్థాయికి ఎదగడం సంతోషకరమన్నారు. ముదిరాజులకు అండగా నిలబడాలని ఆయనను కోరారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ముదిరాజ్ సంఘం మహిళలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంబాల దేవరాజు, ఉమ్మడి ఎల్లారెడ్డిపేట మండల అధ్యక్షుడు నాగరాజు, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు లక్పతి నాయక్, తిరుపతి రెడ్డి, ముదిరాజ్ సంఘం సభ్యులు, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్ల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మరింత ఉత్తమ సేవలు అందించాలని బదిలీపై వెళుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవరణలో గల పరేడ్ గ్రౌండ్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్పీ గితే మహేశ్‌బాబా సాహెబ్‌కు స్వాగతం పలికి ఆదిలాబాద్‌కు బదిలీపై వెలుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్‌కు పోలీసు అధికారులు, సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ ప్రజాశాంతి కోసం రాజీపడకుండా తనతో పాటు హోంగార్డుల నుంచి ఉన్నతాధికారుల వరకు అందరికి కృతజ్ఞతలు తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాలు జిల్లాలో పనిచేసే అవకాశం రావడం సంతోషాన్ని ఇచ్చిందని, సమర్థవంతంగా పనిచేసిన మధుర స్మృతులతో బదిలీపై వెళ్లడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ అధికారులు ఉత్తమ సేవలు అందిస్తే గుర్తింపు పొందుతారన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణ కోసం అంకిత భావంతో పనిచేసిన ప్రతి ఒక్కరు అభినందనీయులని అన్నారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, మురళీకృష్ణ, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన గితె మహేశ్ బాబా సాహెబ్

సిరిసిల్ల క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): ఎస్పీగా గితె మహేశ్‌బాబా సాహెబ్ శనివారం సాయంత్రం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఎస్పీగా పనిచేసిన అఖిల్ మహాజన్ నూతన ఎస్పీకి బాధ్యతలు అప్పగించి రిలీవ్ అయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌వోలు ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి అభినందనలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్పీ గితె మహేశ్ బాబా సాహెబ్

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు..

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేశ్ బాబాసాహెబ్ అన్నారు. శనివారం ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉంటుందన్నారు. ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ప్రజలకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటూ చట్టపరిధిలో వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ప్రజల రక్షణే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు.

జోరుగా గుట్కా దందా

జిల్లాలో యథేచ్ఛగా అమ్మకాలు..

పొరుగు రాష్ట్రాల నుంచి భారీగా రవాణా



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

గుట్కా అమ్మకాలు రాష్ట్రంలో నిషేధం. కానీ బహిరంగంగానే ఎక్కడైనా గుట్కా ప్యాకెట్లు దొరుకుతున్నాయి. అడపాదడపా టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేస్తూ గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్నా అమ్మకాలు మాత్రం రాజన్న సిరిసిల్ల జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్నాయి. పోలీసులు, ఎక్సైజ్ అధికారులు గంజాయి పైనే దృష్టి పెట్టడంతో గుట్కా అమ్మకాలపై నియంత్రణ లేకుండా పోయిందనే ఆరోపణలు వస్తున్నాయి. గంజాయి గుట్టుగా రవాణా అవుతుండగా గుట్కా ప్యాకెట్ల దందా జోరుగానే సాగుతోంది.

రాజన్న సిరిసిల్ల జిల్లాకు పొరుగున ఉన్న రాష్ట్రాల్లో గుట్కాలపై నిషేధం లేకపోవడంతో రవాణా సులభంగా సాగుతోంది. గతంలో టాస్క్ ఫోర్స్ అధికారులు లక్షల విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని పలువురిని అరెస్ట్ చేసిన సంఘటనలు ఉన్నాయి. నామమాత్రపు నిఘాతోనే గుట్కా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారే గుట్కా మహమ్మారి బారినపడి ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారు. మరోవైపు వ్యాపారులు అధిక ధరలతో సొమ్ము చేసుకుంటున్నారు.

పేర్లు మార్చి అమ్మకాలు..

జిల్లాలో గుట్కా ప్యాకెట్లకు కొత్త పేర్లు పెట్టి పిలుస్తున్నారు. ఆర్ఎండీ, ఆర్ఆర్, గోవా, సాగర్ వంటి గుట్కా ప్యాకెట్లకు సినిమా పేర్లు పెట్టి అమ్ముతున్నారు. రూ.5 నుంచి రూ.10 వరకు ఉండే గుట్కా ప్యాకెట్లు రూ.15 నుంచి రూ.20 వరకు అమ్ముతున్నారు. కొన్నిచోట్ల గుట్కా పేర్లతోనే అమ్మకాలు సాగిస్తున్నారు.

మహారాష్ట్ర నుంచి జిల్లాకు..

రాజన్న సిరిసిల్ల జిల్లాకు పొరుగుననే ఉన్న మహారాష్ట్ర నుంచి రైలుమార్గాన కామారెడ్డికి గుట్కా రవాణా జరుగుతోంది. సిరిసిల్ల జిల్లా కేంద్రానికి 60 కిలోమీటర్ల దూరంలోనే కామారెడ్డి ఉండడంతో సులువుగా గుట్కా ప్యాకెట్లు సరఫరా అవుతున్నాయి. అంతేకాకుండా మహారాష్ట్ర శివారు పల్లెల నుంచి సిరిసిల్ల జిల్లా చుట్టు పక్కల గ్రామాలకు వచ్చే సరిహద్దు దారులు ఎన్నో ఉన్నాయి. చిన్నచిన్న గ్రామాల మీదుగా ఆటోలు, ద్విచక్రవాహనాలపై జిల్లాకు గుట్కా ప్యాకెట్లను రవాణా చేస్తున్నారు.

గంజాయి నియంత్రణే లక్ష్యంగా..

పోలీస్ యంత్రాంగం గంజాయి నియంత్రణే లక్ష్యంగా పనిచేస్తోంది. ఇందులో భాగంగా పాఠశాల, కళాశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించడంతో పాటు యాంటీ డ్రగ్స్ క్లబ్‌లను ఏర్పాటు చేసింది. కానీ గుట్కా, ఇతర మత్తు పదార్థాలకు యువత ఆకర్షితులు అవుతోంది. గంజాయి నియంత్రణలో కేసుల నమోదు కూడా పెరుగుతున్నాయి. 2021లో 22 కేసుల్లో 71 మందిని

మిగతా 8వ పేజీలో





తుంగతో నిండిన కాల్వ

చి'వరి'కి సాగునీరందేదెలా..?

- 9వ ప్యాకేజీ కాల్వలో నిండిపోయిన తుంగ, మట్టి
- సాగునీటి కోసం రైతులు ఎదురుచూపులు

7

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

- తెలంగాణ రక్షణ సమితి (డెమొక్రటిక్) రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

8



నియామక పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

ఇల్లంతకుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పేర్కొన్నారు. మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఇరిగేషన్ అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యమానేరు, అన్నపూర్ణ రిజర్వాయర్ ద్వారా విడుదలయ్యే నీటితో గొలుసుకట్టు చెరువులు నింపాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా అధికారులు కాలువలను నిరంతరం పరిశీలించాలన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే దాచారం, బోటిమీదిపల్లె, పెద్దలింగాపూర్, రామోజిపేట తదితర గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. భూసేకరణ కోసం అధికారులు నివేదిక ఇచ్చారని ప్రభుత్వం దృష్టికి తీసుకపోయి నిధుల మంజూరు చేయిస్తానన్నారు. సమావేశంలో సిరిసిల్ల ఆర్డీవో రాధాబాయి, ఈఈ వేణుబాబు, డీఈలు దేవేందర్, సీతారామరాజు, తహసీల్దార్ ఫారూఖ్, మాజీ ఎంపీపీలు రమణారెడ్డి, అయిలయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాఘవరెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి, అంతగిరి వినయ్‌కుమార్, పసుల వెంకటి, పాశం రాజేందర్‌రెడ్డి, ఆనందరెడ్డి, బాలపోచయ్య, బాల్‌రెడ్డిలతో పాటు ఏఎంసీ డైరెక్టర్లు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

రాజన్నను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు



కుటుంబ సభ్యులతో కలిసి కోడెమొక్కు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

వేములవాడ కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్‌బాబు శనివారం దర్శించుకున్నారు. ఆయనకు బీఆర్ఎస్ కార్యకర్తలు స్వాగతంపలికారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కును చెల్లించుకున్నారు. ఆలయ అద్దాల మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.

వేములవాడ కన్నతల్లిలాంటిది..

వేములవాడ తనకు కన్నతల్లిలాంటిదని.. ఇక్కడ ప్రజలందరు సుభిక్షంగా ఉండాలనేది తన కోరిక అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేష్‌బాబు అన్నారు. రాజన్న దర్శనం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. తన తండ్రి రాజేశ్వర్‌రావు ఈప్రాంత అభివృద్ధికి కృషి చేశారని, ఆయన అడుగుజాడల్లోనే తాను కూడా అభివృద్ధిలో భాగస్వామ్యం అయ్యాయని గుర్తుచేశారు. వెంట బీఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

● కోనరావుపేట : వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు తన స్వగ్రామమైన మండలంలోని నాగారం గ్రామానికి శనివారం కుటుంబసభ్యులతో చేరుకొని గుట్టపై వెలిసిన కోదండరామ స్వామిని దర్శించుకున్నారు. గ్రామంలోని పెద్దలు, స్నేహితులను కలిసి సరదాగా గడిపారు. అనంతరం గ్రామస్థులు రమేష్‌బాబు దంపతులను సన్మానించారు. వెంట దేవరకొండ తిరుపతి, మాజీ ఎంపీపీ చంద్రయ్యగౌడ్, మల్యాల దేవయ్య, కిషన్‌రావు తదితరులు ఉన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవం

సిరిసిల్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. మహిళ సంఘాలు, స్వచ్ఛంధ సంస్థలు, కార్మిక సంఘాలు వివిధ పార్టీల ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు సన్మానం చేశారు. శనివారం మహిళ దినోత్సవం సందర్భంగా మహతి డిగ్రీ కళాశాలలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాజన్న సిరిసిల్ల జిల్లా శాఖ ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను ఐడీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రాజు ప్రారంభించగా, మహిళా దంత వైద్యులు కేక్ కట్ చేసి సంబురాలు జరిపారు. ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గోపి, డాక్టర్ శివరామకృష్ణ, డాక్టర్ గీత, డాక్టర్ ఆకాంక్ష, డాక్టర్ రమ్య, డాక్టర్ త్రిసంధ్య, డాక్టర్ దీపిక, కళాశాల ప్రిన్సిపాల్ భూమేష్‌లు పాల్గొన్నారు.

మహిళల 2కే రన్..

మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లా రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బతుకమ్మ ఘాట్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు మహిళలు 2కే రన్ నిర్వహించారు. వివిధ అంశాలపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆదియోగి యోగ సాధన నిలయం సభ్యుడు ఉప్పాల శ్రీనివాస్, పీఈటీలు మైఖేల్, నవీన్, బాలాజి, అశోక్, రన్నర్స్ అసోసియేషన్‌ప్రతినిధులు సాయికుమార్, అశోక్, దేవరాజు, కవిత, విమల, లావణ్య, బేలా, సుల్తానా, సౌజన్య, నక్షత్రలు పాల్గొన్నారు.



సిరిసిల్లలో 2కే రన్..

లోక్ అదాలత్‌లో 12,508 కేసుల పరిష్కారం



దంపతులకు అవార్డుకాపీ అందజేస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య



వేములవాడలో అవార్డు కాపీ అందజేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి

సిరిసిల్ల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజీయే రాజమార్గమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్ అన్నారు. శనివారం సిరిసిల్ల జిల్లా కోర్టులో జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా జిల్లావ్యాప్తంగా 7 బెంచ్‌ల ద్వారా 12,508 కేసులు పరిష్కరించి రూ 1,11,66,562 చెల్లింపులు జరిగాయన్నారు. భార్యభర్తల మధ్యఉన్న కేసుల్లో రాజీ ఏర్పడడంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు దంపతులకు అవార్డు కాపీ ఇచ్చి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ ప్రవీణ్, అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కె. సృజన, జూనియర్ సివిల్ జడ్జి గడ్డం మేఘన, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు దోర్నాల సంజీవరెడ్డి, కార్యదర్శి వెంకటి, లోక్ అదాలత్ సభ్యులు చింతోజు భాస్కర్, పీపీలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ కోర్టు సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి మాట్లాడుతూ క్షణికావేశంతో దారుణాలకు పాల్పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు శ్రీనివాస్, వెంకటేశ్వర్ తదితరులు ఉన్నారు.

విద్యుత్ వినియోగదారులు జాగ్రత్త వహించాలి

సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), మార్చి 8(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు జాగ్రత్తలు వహించి విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా చూసుకోవాలని సిరిసిల్ల సెస్ చైర్మన్ చిక్కాల రామారావు కోరారు తంగళ్లపల్లి మండల కేంద్రంలోని సెస్ కార్యాలయంలో శనివారం మండలంలోని తాడూరు గ్రామంలో ఇటీవల విద్యుత్‌ఘాతంతో మృతిచెందిన మధుప్రియ కుటుంబ సభ్యులకు ఐదు లక్షల రూపాయల చెక్కును సెస్ చైర్మన్ చిక్కాల రామారావు మృతురాలి భర్త రాకేష్‌కు అందించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తాడూరు గ్రామానికి చెందిన మధుప్రియ అనే మహిళ తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్‌ఘాతంతో మృతిచెందింది ఆ కుటుంబానికి నష్టపరిహారం కింద ఐదు లక్షల సెస్ సంస్థ మంజూరు చేయడం జరిగింది. ఆ కుటుంబానికి తక్షణ సహాయం కింద 50 వేల రూపాయలలో రూ.25వేల చొప్పున వారి పిల్లలపై ఫిక్స్ డిపాజిట్ చేయడం జరిగిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మధుకర్, దేవేందర్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లరావు, నవీన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌కు మాతృదేవో పురస్కారం

సిరిసిల్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రానికి చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌కు మాతృదేవో పురస్కారంతో సత్కరించారు. శుక్రవారంరాత్రి హైదరాబాద్, రవీంద్రభారతిలో తెలంగాణ బాషా, సాంస్కృతిక శాఖ, లేఖిని రచయిత్రుల వేదిక ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు మాతృదేవో పురస్కారాలను అందించారు. ఇందులో భాగంగా బాల సాహిత్యంలో విశేషంగా కృషి చేస్తున్న సిరిసిల్లకు చెందిన డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌కు సాంఘీక సంక్షేమ శాఖ మాజీ మంత్రి కొండ్రు పుష్పలీల, అమృతలత, విజయదుర్గ, అలూరి విజయలక్ష్మీ పురస్కారాన్ని అందించారు. పురస్కారాన్ని అందుకోవడంపై జిల్లాకు చెందిన కవులు, రచయితలు అభినందనలు తెలిపారు.



పురస్కారాన్ని అందుకుంటున్న డాక్టర్ కందేపీ రాణీప్రసాద్

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయం ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా వేద పండితులు రాచర్ల రఘురామశర్మ నేతృత్వంలో యాగశాల ప్రవేశం, అంకుర్పారణం, ప్రధాన కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, విగ్రహాములు జలాధివాసం తదితర కార్యక్రమాలను జరిపించారు. ఈనెల 9న ప్రధాన దేవతాహవనం, మూల మంత్ర హవనం, ధాన్యాధివాస, పుష్పాధివాస, ఫలాధివాసం ఈ నెల 10న యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ స్థాపన, ప్రాణ ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, కుంభాభిషేకం, మడేలేశ్వరస్వామి శీతాలమ్మ శివ పరివారం, సరస్వతి ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

మహిళలపై దాడులను ప్రభుత్వాలు అరికట్టాలి

- అఖిల భారత మహిళా సమైక్య జిల్లా కన్వీనర్ రోజా



మాట్లాడుతున్న టీపీటీఎఫ్ మహిళా జిల్లా అధ్యక్షురాలు మాలతి

సిరిసిల్ల టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వాలు అరికట్టాలని అఖిల భారత మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ కే రోజా అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కార్మిక భవనంలో సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడారు. మహిళలకు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా హక్కులు కల్పించాలన్నారు. టీపీటీఎఫ్ మహిళా జిల్లా అధ్యక్షురాలు మాలతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక కార్పొరేషన్, మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. మిడ్‌డే మీల్స్ జిల్లా ప్రధానకార్యదర్శి మీన లక్ష్మణ్, నాయకులు మార్వాడి సుదర్శన్, లక్ష్మి, రజిత, లావణ్య, సుజాత, రేవతి, మంజుల, నరసవ్వ, సంగీత, ప్రేమలత, శ్యామల పాల్గొన్నారు.

గుడిసెల్లోకి దూసుకెళ్లిన వాహనం..

వేములవాడ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మూలవాగును ఆనుకుని రెండవ బైపాస్‌లో పక్కన ఏర్పాటు చేసిన కూరగాయల గుడిసెల్లోకి శుక్రవారం గుర్తుతెలియని వాహనం దూసుకెళింది. తెల్లవారుజామున కూరగాయలు విక్రయించేందుకు వచ్చిన రైతులు కూలిపోయిన గుడిసెలను, చెల్లాచెదురుగా పడి ఉన్న సామగ్రిని గుర్తించారు. అర్ధరాత్రి సంఘటన చోటుచేసుకోవడంతో పెను ప్రమాదం తప్పింది.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


నూతన్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామానికి చెందిన నమిలికొండ నూతన్(27) అనే యువకుడు చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. నూతన్ గ్రామంలో తన తల్లి రాజవ్వ, సోదరుడు నరేశ్‌లతో కలిసి ఉంటున్నాడు. ఈ ఏడాది జనవరి 9న తల్లి రాజవ్వ బంధువుల ఇంటికి వెళ్లగా, సోదరుడు నరేశ్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. నూతన్ కట్టెల పొయ్యిపై వంట చేస్తున్న క్రమంలో మూర్ఛ వచ్చి పడిపోవడంతో మంటలు అంటుకున్నా యి. స్పృహలోకి వచ్చిన నూతన్ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు మండల కేంద్రంలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా మారడంతో హైదరాబాద్‌కు తరలించారు. రెండు నెలల పాటు చికిత్స పొందు తూ శనివారం మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రమాకాంత్ తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని తాజా, మాజీ సర్పంచ్ శంకర్ కోరారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

కరీంనగర్ క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న గుర్తుతెలియని వ్యక్తి(60) శనివారం వేకువజామున మృతి చెందాడని ప్రభుత్వ ఆసుపత్రి అవుట్‌పోస్ట్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్ తెలిపారు. మాతాశిశు కేంద్రం వద్ద అపస్మారక స్థితిలో కిందపడి ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని ఈ నెల 6న అవుట్‌పోస్ట్ హోంగార్డు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడని పేర్కొన్నారు. మృతుడి వద్ద గుర్తింపునకు ఆధారాలు లభించలేదని, గుర్తించినవారు వెంటనే రెండో ఠాణా పోలీసులు లేదా ప్రభుత్వ ఆసుపత్రిలోని అవుట్ పోస్ట్‌కు సమాచారం అందించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం మల్యాల గ్రామంలోని కోరుట్ల-వేములవాడ ప్రధాన రహదారిలో కల్వర్టు మూల మలుపు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం.. మల్యాలకు చెందిన పోతరాజు గంగాధర్ చందుర్తి నుంచి మల్యాలకి వెళుతుండగా, సనుగుల గ్రామానికి చెందిన శివరాత్రి రమేష్ మల్యాల నుంచి చందుర్తికి వస్తున్నారు. మల్యాల గ్రామంలోని కల్వర్టు వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం వేములవాడలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. గంగాధర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్థులు తెలిపారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు : ముగ్గురికి గాయాలు

జమ్మికుంట రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తనుగుల గ్రామం వద్ద బైక్‌ను కారు ఢీకొట్టడంతో దంపతులతో పాటు వారి కూతరు తీవ్రగాయాలపాలయ్యారు. కోరపల్లి గ్రామానికి చెందిన పింగిలి శ్రీకాంత్, భార్య జ్యోతిష్మ, కుమార్తెతో కలిసి బైక్‌పై వావిలాల గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా మార్గమధ్యలో తనుగల సమీపంలో వీరి బైక్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. అటువైపుగా వస్తున్న డాక్టర్ చందన క్షతగాత్రులను గమనించి సంఘటన స్థలంలో ప్రాథమిక వైద్యం అందించారు. అనంతరం 108లో జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు

● 21 మందికి జరిమానా విధించిన న్యాయమూర్తి

ఎల్లారెడ్డిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతో పాటు వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై రమాకాంత్ శనివారం హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు గ్రామాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, మద్యం సేవించి వాహనాలు నడిపిన 21 మందిని కోర్టులో హాజరుపరచగా సిరిసిల్ల రెండవ అదనపు న్యాయమూర్తి జయశ్రీ ఒక్కొక్కరికి వెయ్యి రూపాయల జరిమానా విధించారని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కేసులు తప్పవని హెచ్చరించారు. ఎల్లారెడ్డిపేట గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ వివరించారు.

నకిలీ పురుగు మందులు విక్రయించిన వారిపై కేసు

బోయినపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రైతుకు నకిలీ పురుగుల మందు విక్రయించిన పెస్టిసైడ్స్ యజమానితో పాటు సదరు కంపెనీ ప్రమోటర్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. నీలోజిపల్లి గ్రామానికి చెందిన ఎర్ర అనిల్ తన మొక్కజొన్న పంటకు పురుగు మందు కోసం వెంకట్రావుపల్లి సమీపాన ఉన్న హెచ్‌టీఆర్ కిసాన్ అగ్రిమాల్ దుకాణానికి వెళ్లాడు. రైతు కోరిన పురుగుల మందు కాకుండా షాప్ యజమాని మరొక కంపెనీకి చెందిన నకిలీ పురుగుల మందును విక్రయించాడు. రైతు పురుగుల మందులు వాడగా మొక్కజొన్న పూర్తిగా దెబ్బతిన్నది. న్యాయం కోసం ఎస్‌ఐని ఆశ్రయించగా షాప్ యజమాని శ్యాంతోపాటు కంపెనీ ప్రమోటర్ గట్టపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మల్యాలలో చోరీ

మల్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మల్యాల మండలకేంద్రంలో శుక్రవారం రాత్రి కొక్కుల మల్లేశ్వరి అనే మహిళ ఇంటిలో దొంగతనం జరిగింది. మల్లేశ్వరి ఇంటిలోని ఓగదికి తాళంవేసి మరోగదిలో నిద్రిస్తుండగా తాళం పగులగొట్టి దుండగులు అరతులం బంగారం ఎత్తుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. మల్లేశ్వరి కొడుకు మహేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరుపుతున్నారు.

జగిత్యాలలో దొంగతనం

జగిత్యాల క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రంలోని గోవిందుపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి చోరీజరిగింది. శ్రీకోటి రాంబ్రహ్మాచారి అనే వ్యక్తి శుక్రవారం తన బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం ఇంటికి రాగా ఇంటితాళాలు పగులగొట్టి ఉన్నాయి. దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువా తాళాలు పగులగొట్టి రూ.40వేల నగదుతోపాటు మూడు గ్రాముల బంగారం అపహరించుకవెళ్లారు. బాధితుడుఇచ్చిన ఫిర్యాదు మేరకు టౌన్‌పోలీసులు సంఘటనస్థలాన్ని పరిశీలించివేలి ముద్రలు సేకరించి కేసునమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం

మల్యాల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని ఓగులాపూర్‌కు చెందిన జేశెట్టి వెంకవ్వ అనే మహిళ అదృశ్యమైనట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. గురువారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు భర్త గంగన్న ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆపరేటర్‌కు గాయాలు

రామగిరి, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామయ్యపల్లె బస్‌స్టాప్ వద్ద శనివారం రాత్రి ఇసుక లారీ ఢీకొన్న ప్రమాదంలో ఏఎమ్మార్ కంపెనీలో ఆపరేటర్‌గా పనిచేసే రాచకొండ శంకర్ తీవ్రంగా గాయపడ్డాడు. నాగేపల్లి గ్రామానికి చెందిన శంకర్ డ్యూటీకి వెళ్తున్న సమయంలో ప్రమాదం చోటుచేసుకొంది. మధ్యాహ్నం రోడ్డు అడ్డంగా చెట్టు విరిగి పడినా తొలగించకపోవడంతో ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో శంకర్ రెండు కాళ్లు విరిగాయి. గాయపడిన వ్యక్తిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

అదృశ్యమైన వృద్ధురాలు మృతి

కథలాపూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లికి చెందిన గుగ్గిళ్ల గంగు అనే వృద్ధురాలు రెండు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి అదృశ్యం కాగా మృతదేహం సారంగపూర్ మండలంలోని రేచపల్లె ఎస్సారెస్పీ కాలువలో లభ్యమైంది. సారంగాపూర్ పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో శవాన్ని కథలాపూర్ పోలీసులు కోరుట్ల ప్రభుత్వఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ తెలిపారు.

పాముల సంరక్షకుడు

● పాములు పట్టడమే రవీందర్ జీవనాధారం

ఓదెల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): విషసర్పాలను పట్టుకొని వాటిని అడవిలో వదిలిపెడుతున్నాడు ఓదెల మండలానికి చెందిన ఎంబాడి రవిందర్. ఎనిమిదేళ్ల నుంచి విషసర్పాలను పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఓదెల మండలంలో పాముల సంరక్షకుడిగా, పాముల రవి అంటే తెలియని వారు ఉండరు. ఏ సమయంలోనైనా ఫోన్‌చేస్తే చాలు ఎటువంటి పామునైనా పట్టుకొంటాడు. జాగ్రత్తలు తీసుకుంటూ పాములను చాకచక్యంగా పట్టుకుంటున్నాడు. కౌలు రైతుగా బతుకు బండిని లాగుతూ అదనపు ఆదాయం మార్గాలను వెతికాడు. అతడి తాత నర్సయ్య పాములు పట్టడాన్ని వారసత్వంగా ఎంచుకున్నాడు. పాములను పట్టడం, పాము కాటుకు మందు ఇస్తున్నాడు. ఎక్కడైనా పామును కొట్టి చంపితే అక్కడికి చేరుకొని వాటిపై అవగాహన కల్పిస్తున్నాడు. ఓదెల మండలంతోపాటు సుల్తానాబాద్, కాల్వశ్రీరాంపూర్, జమ్మికుంట మండలంలోని పలు గ్రామాల్లో 1500లకు పైగా పాములను పట్టుకొని నివాసాలకు దూరంగా, మానేరు తీరాన, గుట్టల ప్రాంతాల్లో, చెట్లపొదల్లో, మైదాన ప్రాంతాల్లో వదిలిపెడుతాడు. పాములు పడుతుండడంతో క్రమంగా అతడి పేరు పాముల రవిగా మారింది. ఇండ్లలో, ఇంటి వద్దనున్న గడ్డి కుప్పల్లో పాము కనబడితే చాలు వెంటనే రవికి కాల్ చేస్తారు.


పామును పట్టుకునే తీరును వివరిస్తున్న రవీందర్

● వ్యవసాయం మానుకొని..

ఓదెలకు చెందిన ఎంబడి రవి కౌలుకు చేద్దామంటే భూములు దొరకకపోవడంతో ఇక చేసేది లేక వ్యవసాయం మానుకొని పాములను పట్టడమే వృత్తిగా మలుచుకున్నాడు. పాములు పడితే చాలు డిమాండ్ చేయకుండా వారు ఇచ్చినంత తీసుకొంటాడు. కొన్నిసార్లు పాముకు రూ.200 నుంచి రూ.వెయ్యి కూడా ఇస్తారు. ఇంటిలోని పాములను పట్టి వాటిని, కుటుంబ సభ్యులను రక్షించడంలో తృప్తి ఉందన్నాడు.

● పాములుంటే పంట దిగుబడి

పాముల ప్రత్యేకత, వాటి వల్ల ఉపయోగాలను రైతులకు వివరిస్తాడు రవి. పాములు ఉంటే పంటల్లో ఎలుకల సంఖ్య తగ్గి దిగుబడికి ఉపయోగపడతాయి. రైతులు జాగ్రత్తగా నడిచి పొలాలకు వెళ్లాలి. భయాందోళనలకు గురై పాములను చంపడం వల్ల అవి కనుమరుగై పోతున్నాయి. వరి పంటల్లో ఎలుకల సంఖ్య అధికమై ఎకరానికి కనీసం 50 కిలోల చొప్పున ధాన్యం తగ్గిపోతుంది.

పాములు.. భయంతోనే కాటు వేస్తాయి

- ఎంబడి రవీందర్ , ఓదెల



చెట్ల మధ్యలో నుంచి వెళ్తుంటే పాములు భయంతోనే పడగవిప్పుతాయి. వాటిని చూసి భయపడకుండా వాటికి దూరంగా ఉండి బయటికి పంపించాలి. అలాగే విషంతోనే విషం విరుగుడు మందులు కనిపెట్టారు. ఇక పాములను చంపడం వల్ల మందుల కొరత ఏర్పడుతుంది. ఎవరైనా 9948724305 నంబర్ కు కాల్ చేస్తే వచ్చి పాములను పట్టుకొని వెళతాను.

పెద్దపులి ఆనవాళ్లు గుర్తింపు

● గేదెపై దాడి చేసినట్లు నిర్ధారణ

వేములవాడ టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం ఫాజుల్‌నగర్ అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉప్పరి నారాయణకు చెందిన గేదెపై పులి దాడి చేసింది. వేములవాడ ఎఫ్ఆర్వో ఖలీలుద్దిన్ సంఘటన స్థలానికి చేరుకుని ఆనవాళ్లను పరిశీలించారు. ఫాజుల్‌నగర్ అటవీ ప్రాంతంలో అధికారులు సేకరించిన ఆనవాళ్లు పెద్దపులి వేనని నిర్ధారించారు. కొడిమ్యాల మండలం కొండాపూర్ ప్రాంతం నుంచి పులి వచ్చినట్లు అధికారులు భావిస్తున్నారు. రోజుకు 5 కిలోమీటర్ల మేర పులి ప్రయాణిస్తుందని, అటవీ ప్రాంతంలో వ్యవసాయానికి వెళ్లే రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

పులి సంచారంతో భయం భయం

వేములవాడ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రూరల్ మండలంలోని ఫాజుల్‌నగర్ అటవీ ప్రాంతంలో పులి సంచరిస్తున్న ఆనవాళ్లు బయట పడటంతో భయం నెలకొంది. ఫాజుల్‌నగర్ శివారులో పులి పాద ముద్రలు రైతులకు కనిపించాయి. దీంతో రైతులు పొలాల వద్దకు వెళ్లేందుకు భయపడుతున్నారు. ఫారెస్ట్ అధికారులు పులి తిరుగుతున్నట్లు ప్రకటన చేయకపో వడంతో ఫాజుల్‌నగర్, నూకలమర్రి, నమిలి గుండుపల్లి, వట్టెంల రైతులు ఆందోళన చెందుతున్నారు.

సిద్దిపేట జిల్లాలో రోడ్డు ప్రమాదం..

● కొత్తపల్లి వాసి మృతి

గంభీరావుపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) సిద్దిపేట జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గంభీరావుపేట మండలం కొత్తపల్లికి చెందిన బట్టలవ్యాపారి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గంభీరావుపేట మండలం కొత్తపల్లి చెందిన బట్టల వ్యాపారి ముత్తయ్య (75) దుబ్బాక మండలం పోతారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ద్విచక్ర వాహనంపై నిత్యం బట్టల వ్యాపారం చేస్తు ముత్తయ్య జీవనం సాగిస్తాడు. బట్టల వ్యాపారంలో బాగంగా ద్విచక్ర వాహనంపై ముత్తయ్య దుబ్బాక వెళ్లి కొత్తపల్లి తిరిగి వస్తుండగా, పోతారం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకోట్టడంతో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ముత్తయ్యను 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరళించారు. చికిత్స పొందుతూ ముత్తయ్య మృతి చెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాస్ పిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దుబ్బాక ఎస్ఐ గంగారాజు తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

మంథని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యసాయినగర్ లో 20క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ శనివారం తెలిపారు. శ్రీపాద సతీష్ అనే వ్యక్తి ఆటోలో 20 క్వింటాళ్ల బియ్యాన్ని అక్రమంగా రవాణాచేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యాన్ దగ్ధం

సిరిసిల్ల క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లి గ్రామ సమీపంలోని టెక్స్‌టైల్ పార్క్ వద్ద శనివారం రాత్రి టీజీ 25టీ 0232 నంబర్‌గల వ్యాన్ ప్రమాదవశాత్తు దగ్ధమైంది. వ్యాన్ యజమాని, అతడి భార్య, కొడుకులకు ప్రమాదం తృటిలో తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బద్దెనపల్లిలోని టెక్స్‌టైల్ పార్క్‌లో నివసిస్తున్న మహేశ్ తన వ్యాన్‌లో భార్య, ఆరేళ్ల కొడుకుతో కలిసి కరీంనగర్ నుంచి టెక్స్‌టైల్ పార్క్‌కు వస్తుండగా ఒక్కసారి పొగలు రావడంతో డ్రైవర్, వాహన యజమాని వ్యాన్‌లో నుంచి దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. అప్పటికే పొగల నుంచి మంటలు అంటుకున్నాయి. దీంతో స్థానికులు అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. సిరిసిల్ల అగ్నిమాపక అధికారి ఎస్ నరేందర్ అగ్నిమాపక వాహనంతో సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో వ్యాన్ దాదాపు మంటల్లో దగ్ధమైంది. 2024లో కొనుగోలుచేసిన వ్యాన్ అయినందున దాదాపు రూ. 32లక్షల నష్టం వాటిల్లినట్లు చెప్పారు. షార్ట్‌సర్క్యూట్ వల్ల వ్యాన్ దగ్ధమైనట్లు తెలిపారు.

కోటిన్నరకు శఠగోపం పెట్టిన జ్యువెల్లరీ యజమాని

● పది రోజుల క్రితమే కుటుంబంతో పరారీ ● 708 గ్రాముల బంగారం, 52 లక్షలు, కిలో వెండితో జంప్

మంథని, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మంథని పట్టణంలోని ధనలక్ష్మి జ్యువెల్లరీ యజమాని సుమారు కోటిన్నర రూపాయలకు పైగా ప్రజల నెత్తిన శఠగోపం పెట్టి పరారయ్యాడు. నమ్మి అప్పులు ఇచ్చిన వారిని, తక్కువ ధరకే బంగారం, వెండి ఇస్తానంటే నమ్మిన వారిని, వివాహ ఆభరణాలు తయారీకి బంగారం ఇచ్చిన వారికి షాపుయజమాని, కుటుంబ సభ్యులు కోటిన్నరకు పైగా ఎగవేసినట్లు శనివారం బహిర్గతమైంది. గతనెల 25వ తేదీనే సదురు షాపు యాజమాని తోరత్ సీతారాం, భార్య, కొడుకులు ప్రవీణ్, ప్రశాంత్‌లతో కలిసి పరారయ్యాడు. సీతారాం కుటుంబం ఇంట్లో, రెండు షాపుల్లో కనిపించకుండా పోవడంతో తొలుత చుట్టుపక్కలవారు, స్థానికులు, కుంభమేళాకు వెళ్లినట్లు భావించారు. అయితే కుటుంబంలో అందరి సెల్‌ఫోన్లు పనిచేయకుండా పోవడంతో వారు పారిపోయినట్లు ఆలస్యంగా గుర్తించారు. దీంతో చేసేది ఏం లేక రెండు షాపు వద్ద శనివారం బాధితులు సమావేశం కావాలని మూడురోజుల క్రితం ఫ్లెక్సీలు


షాపు వద్ద బాధితులు

ఏర్పాటు చేశారు. శనివారం బాధితులంతా కలిసి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. బాధితులు చెప్పిన ప్రకారం.. సీతారాం కుటుంబం మోసం చేసిన బాధితులు 51మంది ఉన్నట్లు తెలిపారు. 708గ్రాముల బంగారం, 52లక్షల నగదు, కిలోవెండి తీసుకున్నట్లు తెలిపారు. బాధితుల్లో అధికంగా ఇంటి యజమాని శారద వద్ద 5లక్షలు, తులంన్నర బంగారం, మరో ఇంటి యజమాని చంద్రశేఖర్ రూ.6లక్షల నగదు, 10తులాల బంగారం తీసుకున్నటు తెలిపారు. మహారాష్ట్రకు చెందిన సీతారాం దాదాపు 20ఏళ్ల క్రితం మంథనికి వచ్చి జ్యువెల్లరీ షాపు నిర్వహించి అందరినీ నమ్మించాడు. భారీగా నగదు, బంగారం, వెండితో ఉడాయించారు. ఇంకా ముందుకు రాని బాధితులు ఉన్నట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

తెల్లారితే పెళ్లి.. ఉరి వేసుకుని వరుడు ఆత్మహత్య


కిరణ్ (ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 8 (ఆంధ్రజ్యోతి): తెల్లవారితే పెళ్లి పీటలు ఎక్కాల్సిన వరుడు లక్కపంల్లి కిరణ్(37) శనివారం తెల్లవారుజామున ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. జగిత్యాలజిల్లా మెట్‌పల్లి మండలం రామచంద్రంపేటకు చెందిన కిరణ్‌కు అదే గ్రామానికిచెందిన యువతితో ఆదివారం వివాహం జరగాల్సిఉంది. వరుడి ఇంటిలో శుక్రవారం రాత్రి హల్దీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం వరుడు గోరింటాకు పెట్టుకుని ఇంటిలోని ఓగదిలో పడుకోవడానికి వెళ్లాడు. శనివారం ఉదయం వరుడు పడుకున్న గదిని శుభ్రం చేయడానికి కుటుంబ సభ్యులు తలుపులు తెరవగా ఫ్యానుకు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. లక్కంపల్లి కిరణ్‌కు ఉన్న ఆరోగ్య సమస్యలతో వివాహం తర్వాత ఏమైనా సమస్యలు వస్తాయేమోని మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకుని ఉంటాడని కుటుంబ సభ్యులు తెలిపారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహానికి మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం చేయించారు. కిరణ్ తల్లి లక్కంపల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్, సీఐల సస్పెన్షన్

సిరిసిల్ల క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఎస్ పంచాక్షరిని, ఎక్సైజ్‌శాఖ సిరిసిల్ల ఇన్‌స్పెక్టర్ గులాం ముస్తాఫాను సస్పెండ్‌చేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్ఎఎం రిజ్వీ, వరంగల్ ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్‌లు శనివారం వేర్వేరుగా ఉత్తర్వులు జారీచేశారు. సిరిసిల్ల పట్టణంలోని చిత్ర బార్‌అండ్‌రెస్టారెంట్‌కి ట్రేడ్‌లైసెన్స్ లేకుండానే 2బిలైసెన్స్ రెన్యువల్ చేసి తప్పుడు నివేదికలు సమర్పించినందుకు క్రమశిక్షణ చర్యలకింద సస్పెండ్ చేస్తున్నట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఇద్దరుఎక్సైజ్ శాఖ అధికారులు సస్పెండ్ కావడం జిల్లా వ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు

● ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కష్టపడి చదివితేనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మానకొండూర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి స్కూల్‌డే వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. అందులో భాగంగా రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు నూతన మెనూను ప్రవేశపెట్టిందన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని సమాజానికి ఉపయోగపడే విధంగా తయారు కావాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించాలని ఆయన సూచించారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆర్‌సీవో అంజలి, ఎంఈవో మధుసుధనాచారి, కాంగ్రెస్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మానకొండూర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల విన్యాసాలు

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

మెట్‌పల్లి రూరల్, మార్చి, 8 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రెండు కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. శనివారం మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్సై కిరణ్‌కుమార్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను వెల్లడించారు. శనివారం ఎస్సై కిరణ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి మండలంలోని వేంపేట గ్రామ శివారులో వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో ద్విచక్ర వాహనంపై ఇబ్రహీంపట్నం మండలంలోని ఎర్రపూర్‌తండాకు చెందిన అజ్మీర్ శ్రీనివాస్ నాయక్, సాయినాయక్‌లు వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయగా 200 గ్రాముల గంజాయి గుర్తించినట్లు తెలిపారు. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకుని మెట్‌పల్లి పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. వారిని విచారించగా నిర్మల్ జిల్లా కొమ్మగూడెం గ్రామానికి చెందిన చౌహన్ రమేష్‌నాయక్ వద్ద రూ.3వేలకు గంజాయిని కొనుగోలు చేసి మెట్‌పల్లిలో విక్రయించడానికి తీసుకు వస్తున్నట్లు తెలిపారన్నారు. వారి వద్ద ఉన్న ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అజ్మీర్ శ్రీనివాస్‌నాయక్, సాయినాయక్‌లను రిమాండ్‌కు తరలించగా పరారీలో ఉన్న చౌహన్ రమేష్ నాయక్ పట్టుకుంటామని సీఐ తెలిపారు.



యువకుల అరెస్టు చూపుతున్న పోలీసులు

కోరిన కోరికలు తీర్చే ఉగ్ర నరసింహుడు

● నేటి నుంచి నల్లగొండలో బ్రహ్మోత్సవాలు ● 11న కల్యాణం

ఇల్లందకుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కోరిన కోరికలు తీర్చే కొండంత దేవుడు నలగొండ గుట్టపై వెలసిన లక్ష్మీ నరసింహస్వామి. ఇల్లందకుంట మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామశివారులో 15 ఎకరాల విస్తీర్ణంలో ఎతైన కొండపైన విశాలమైన ప్రదేశంలో 200ఏళ్ల క్రితం వెలిశాడు ఉగ్ర నరసింహస్వామి. ఇల్లందకుంట మండల కేంద్రానికి 5కిలో మీటర్లు చిన్నకోమటిపల్లి గ్రామానికి 2కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంటుంది. ఈ ఆలయం భక్తుల విరాళాలతోనే అభివృద్ధి చెందుతోంది. ఇప్పటివరకు గ్రామస్థులు రూ.15లక్షల విరాళాలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఈ ఆలయాన్ని ఏ అధికారి.. పాలకులు పట్టించకోవడం లేదు. ప్రభుత్వం స్పందించి ఆలయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లయితే మరింత అభివృద్ధి చెందుతుంది.


కొండపై కొలువుదీరిన లక్ష్మీనరసింహస్వామి

● నేటి నుంచి బ్రహ్మోత్సవాలు..

స్వామివారిబ్రహ్మోత్సవాలు ఆదివారంనుంచి ప్రారంభంకానున్నాయి. ఈనెల9న విశ్వక్సేన ఆరాధన, స్వస్తీ వచనం, స్తంభపూజ, అంకురార్పణ, రక్షబంధనం, ఋత్విక్‌కరణం, 10న స్వామివారికి ఫల పంచామృత అభిషేకం, తీర్థప్రసాదవితరణ, 11న కల్యాణం అత్యంత వైభవంగా జరుగుతాయి. తీర్థ ప్రసాదవితరణ, మహాఅన్నప్రసాద కార్యక్రమం, సాయంత్రం గ్రామ పురవీధుల గుండా ఉత్సవమూర్తుల ఊరేగింపు. 12న బండ్లు తిరుగుట, ఉత్సవాల ఊరేగింపు జరుగును. బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

నిత్యం పూజలు చేస్తుంటాం.

- తెల్లవర్థుల ప్రదీప్‌శర్మ, ఆలయ అర్చకుడు, చిన్నకోమటిపల్లి



ఆలయంలో స్వామివారికి నిత్యపూజలు జరుగుతుంటాయి. ప్రభుత్వం దూప, దీప, నైవేధ్య నిధులు అందించినట్లయితే బాగుంటుంది. ఈ ఆలయానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. భక్తుల విరాళాలతోనే నిత్యవిధి కార్యక్రమాలు చేపడుతున్నాం.

యుద్ధప్రాతిపదికన వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లు మంజూరు

● ఎస్ఈ మేక రమేష్‌బాబు

గణేశ్‌నగర్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రైతులకు యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ విద్యుత్ సర్వీస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ రమేష్‌బాబు తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటివరకు లక్షా 9వేల సర్వీసు కనెక్షన్లు ఉన్నాయని, 2024 నుంచి 2025 ఫిబ్రవరి వరకు 1350 మంజూరు చేశామని అన్నారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే దాదాపు 30 శాతం పెరిగినట్లు చెప్పారు. పంట కోతలవగానే ఏప్రిల్, మే, జూన్‌లో వ్యవసాయ సర్వీసుల మంజూరు వేగవంతం చేస్తామన్నారు.

అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

మెట్‌పల్లిటౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : విలేకరి ముసుగులో అక్రమంగా వసూళ్లకు పాల్పడుతున్న పట్టణానికి చెందిన గట్టెపల్లి రాజశేఖర్‌ను అరెస్ట్ చేసినట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి శనివారం తెలిపారు. ఆయన తెలిపిన ప్రకారం.. పట్టణానికి చెందిన రాజశేఖర్ గత కొంత కాలంగా ఆర్‌ఆర్ న్యూస్ పేరిట యూట్యూబ్ చానల్ నిర్వహిస్తూ విలేకరి ముసుగులో అమాయక ప్రజలను, వ్యాపారులను, ప్రభుత్వ అధికారులను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిపారు. అమాయక ప్రజలను చూసి తను విలేఖరిని అని పోలీస్‌లతో పరిచయాలు ఉన్నాయని చెప్పి పైరవీలు చేసి డబ్బులు సంపాదించేవాడని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రెండు, మూడు సార్లు సీఐ నిరంజన్‌రెడ్డి వద్దకు బాధితులను తీసుకెళ్లి అక్రమంగా డబ్బులు వసూలు చేయాలని చూశాడు. సీఐ పైరవీలకు అవకాశం ఇవ్వకుండా బాధితులతో నేరుగా మాట్లాడి సమస్య పరిష్కారించడంతో సీఐపై కక్ష పెంచుకుని ఆయన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ప్రయత్నించాడు. సోషల్ మీడియాలో తప్పుడు కథనాలు ప్రచురితం చేశాడు. ఒకరిని బెదిరించి బ్లాక్ మెయిల్ చేసిన సంఘటనలో మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ కుమార్‌కు ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేసి రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

కల్వల ప్రాజెక్టును పట్టించుకోరా..?

● వృథాగా పోతున్న సాగునీరు

● సొంత డబ్బులతో తాత్కాలిక మరమ్మతులు చేయించుకున్న రైతులు

శంకరపట్నం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): శంకర పట్నం మండలంలోని కల్వల ప్రాజెక్టుకు రెండేళ్ల క్రితం గండి పడింది. అప్పటి ప్రజాప్రతినిధుల ఆదేశాలతో అధికారులు అప్పటికప్పుడు తాత్కాలిక మరమ్మతులు చేసి రైతులకు సాగునీరు అందించారు. వర్షాకాలంలో వరద ఉధృతి పెరగడంతో రింగ్ బండు తెగి నీరు దిగువకు పోయింది. ఇప్పటి వరకు గండి పడిన ప్రాజెక్టును ప్రజాప్రతినిధులు పరిశీలించలేదు. కల్వల ప్రాజెక్టు ద్వారా శంకరపట్నం మండలం, వీణవంక మండలానికి



కల్వల ప్రాజెక్టు కట్ట తెగిపోకుండా సంచుల్లో మట్టి నింపి కట్టకు అడ్డుగా వేస్తున్న రైతులు

సాగునీరు అందుతుంది. ఓ వైపు అధికార పార్టీ ఎమ్మెల్యే మరోవైపు ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యే ఉన్నారు. ఈ ప్రాజెక్టు మరమ్మతులు ఎవరూ పట్టించుకోకపోవడంతో తమ పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా అయ్యిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాజెక్టు కింద 3500 ఎకరాలకు పైగా భూమి సాగు అవుతుంది. గద్దపాకకు చెందిన 80 మత్స్యకార కుటుంబాలు ఈ ప్రాజెక్టు మీద ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు.

● గొలుసుకట్టు చెరువులకు అనుసంధానంగా..

ప్రాజెక్టు కింద సాగు చేసుకునే రైతులందరూ కలిసి యాసంగిలో కొంత డబ్బు జమ చేసి తాత్కాలికంగా గండికి అడ్డుగా కట్ట నిర్మించారు. కల్వల శివారులో ఈ ప్రాజెక్టును గొలుసు కట్టు చెరువులకు అనుసంధానంగా నిర్మించారు. వర్షాకాలంలో హుస్నాబాద్, చిగురు మామిడి, సైదాపూర్, శంకరపట్నం మండలాల్లో కురిసిన వర్షపు నీరు గొలుసుకట్టు చెరువుల ద్వారా ఏర్పడిన వాగులు, ఒర్రెల ద్వారా వచ్చే నీరు కల్వల శివారులో నిర్మించిన ఈ ప్రాజెక్టులోకి చేరుతుంది. ఈ నీరు ప్రవహించే మార్గంలో సైదాపూర్ మండలం సోమారం శివారులో కాకతీయ కాలువకు ఒక ఎస్కేప్ ఏర్పాటు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో కెనాల్‌లో ఉన్న నీటిని విడుదల చేయడానికి దీన్ని వినియోగిస్తారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఎస్కేప్ ద్వారా దిగువకు వదిలిన నీరు కేశవపట్నం, ముత్తారం, ఎరడపల్లి, అర్కండ్ల, గద్దపాక వాగుల మీదిగా కల్వల చెరువులో చేరుతుంది. ఆయా ప్రాంతాల రైతులు వాడుకోగా మిగిలిన నీటిని గండి ద్వారా వృథాగా కిందికి పోనివ్వకుండా రైతులు కొంత నిధులు సమకూర్చుకొని తాత్కాలికంగా కట్ట ఏర్పాటు చేసుకొని నీటిని సాగుకు తరలించుకుంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ వేసవిలో ప్రాజెక్టుకు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రాజెక్టుకు మరమ్మతులు చేయాలి

- అమృత ప్రభాకర్, రైతు, వీణవంక



ప్రాజెక్టు గండి పడడంతో నీరు లేక సాగు చేసుకోవడం ఇబ్బందిగా మారింది. తాత్కాలిక మరమ్మతులకు 20 వేల రూపాయలు అందించాను. కల్వల ప్రాజెక్టుకు వేసవిలో మరమ్మతులు చేసి వానాకాలంలో రైతులకు సాగునీరు అందించాలి.



కాకతీయ కెనాల్ ఎస్కేప్ ద్వారా వెళ్తున్న నీరు

చి'వరి'కి సాగునీరందేదెలా..?

● 9వ ప్యాకేజీ కాల్వలో నిండిపోయిన తుంగ, మట్టి

● సాగునీటి కోసం రైతులు ఎదురుచూపులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మల్కపేట జలాశయం నుంచి ఎల్లారెడ్డిపేట మండలానికి సాగు నీరందించే 9వ ప్యాకేజీ కాల్వ పొడవునా తుంగ, మట్టితో నిండిపోయింది. షటరు వద్ద ఏపుగా పెరిగి తుంగ నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారింది. కాల్వంతా మట్టితో దర్శనమిస్తోంది. మండలంలోని దేవునిగుట్ట తండా, రాజన్నపేట, అల్మాస్‌పూర్, రాచర్లగొల్లపల్లి, బాకురుపల్లితండా, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లోని రైతులు సాగు చేసిన వరి పంటలు భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో ఎండిపోతున్నాయి. పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3టీఎంసీల సామర్థ్యంగల మల్కపేట జలాశయంలో 0.75 టీఎంసీల నీళ్లు ఉండడంతో 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా మెట్ట ప్రాంతానికి గోదావరి జలాలు అందించాలని 20 రోజుల క్రితం సంబంధిత శాఖ అధికారులను ఆదేశించింది. ఆ దిశగా అధికారులు కాల్వలో పేరుకుపోయిన మట్టి, తుంగను నామమాత్రంగా తొలగించారు. నాలుగు రోజుల పాటు మల్కపేట జలాశయం నుంచి ఎగువ ప్రాంతానికి నీరు వచ్చి నిలిచిపోయింది. జలాశయం నుంచి తరలించేందుకు నీళ్లు లేవని సంబంధిత శాఖ అధికారులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి 1టీఎంసీ నీటిని పంపింగ్ ద్వారా మల్కపేట జలాశయాన్ని నింపితే 9వ ప్యాకేజీ కాల్వకు సాగునీరు సరఫరా అవుతుందని ప్రభుత్వానికి నివేదించారు. స్పందించిన ప్రభుత్వం 0.50 టీఎంసీ విడుదల చేసేందుకు అంగీకరించడంతో ఐదు రోజుల క్రితం అధికారులు ప్రారంభించారు. నీరు మల్కపేట జలాశయానికి వచ్చి చేరుతోంది. ధర్మారం గ్రామ శివారులో ఉన్న 9వ ప్యాకేజీ కాల్వ షటరును అధికారులు పైకెత్తి నీటిని సరఫరా చేస్తున్నారు. షటరు వద్ద తుంగ ఏపుగా పెరిగింది. కాల్వలో భారీగా మట్టి పేరుకుపోయింది. సాగునీరు వస్తుందని ఎగువ ప్రాంతంలోని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. కాల్వ ఇలా ఉంటే చివరికి సాగునీరు అందేదెలాగని..? అన్నదాతలు ప్రశ్నిస్తున్నారు. కాల్వలోని తుంగ, మట్టిని తొలగించి తమ సాగు నీటి కష్టాలను తీర్చాలని వేడుకుంటున్నారు.



మల్కపేట జలాశయం 9వ ప్యాకేజీ కాల్వ షటరు వద్ద నిండిపోయిన తుంగ

పంటలు కాపాడేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

- కిషోర్‌కుమార్, 9వ ప్యాకేజీ ఈఈ

ఎల్లారెడ్డిపేట మండలంలోని దేవునిగుట్ట తండా, రాచర్లగొల్లపల్లి, బాకురుపల్లితండా, తిమ్మాపూర్, రాజన్నపేట, అల్మాస్‌పూర్ గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటి సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మల్కపేట జలాశయం నుంచి 9వ ప్యాకేజీ కాల్వ ద్వారా నీటిని అందించేందుకు చర్యలు చేపట్టాం. పంటలు కాపాడేలా ప్రత్యామ్నాయ ఏర్పాట్లుచేశాం. కాల్వలో సాగునీరు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న మట్టిని తొలగించాం. ప్రస్తుతం నీరు వెళ్లేందుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తిచేశాం. కాల్వలో పేరుకుపోయిన మట్టి, తుంగను మే మాసంలో పూర్తిగా తొలగిస్తాం.

కలెక్టర్‌కు మహిళా శక్తిమాన్ అవార్డు ప్రదానం



కలెక్టర్ పమేలా సత్పతికి అవార్డు అందిస్తున్న ప్రతినిధులు

కరీంనగర్ కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ, జిల్లా నాటక సమాజాల సమాఖ్య, కళారవళి సోషియో కల్చరల్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి మహిళా శక్తిమాన్ అవార్డు ప్రదానం చేశారు. ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళలు ముందడుగు వేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థల ప్రతినిధులు గుండ్ర కృపాదానం, మాడిశెట్టి గోపాల్, విష్ణుదాస్ గోపాల్‌రావులో పాటు సబితా విజయ కుమారి, పి జ్ఞానప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు హెల్త్‌స్కీం కోసం కృషి

- ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్‌రెడ్డి

జగిత్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ఉద్యోగ, ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రవేశపెట్టనున్న హెల్త్ స్కీమును ప్రయివేటు ఉపాధ్యాయులకు వర్తింపజేసేందుకు అవసరమైన కృషిని చేస్తానని పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శనివారం పట్టణానికి వచ్చిన ఆయన విద్యానగర్‌లోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ స్కీమ్ రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే అమలు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చారని తెలిపారు. పట్టణానికి వచ్చిన ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డిని పలువురు పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు పూలమాలలు, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎస్ పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బోయినిపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి చాలా అమర్ నాథ్ రెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వుజగిరి జమున, శశికళ, జయప్రద తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో పూజలు

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని టీచర్స్ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి దంపతులు శనివారం సందర్శించారు. స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముఖ్య అర్చకులు నంబి నరసింహమూర్తి ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ ఆయనకు స్వామి శేష వస్త్రం, ప్రసాదాలు అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ టీచర్స్ సమస్యల గురించి సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. త్వరలోనే టీచర్స్ సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. ఆయన వెంట ఆలయ అభిషేక్ పొరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఎంఈవో సీతాలక్ష్మి, పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షులు బోయిన్‌పెల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, గజబీంకార్ గోవర్ధన్, దొహిగాం గణేష్ పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

తిరుపతికి ప్రతిరోజూ రైలు నడపండి

- కేంద్ర రైల్వే మంత్రికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ లేఖ

కరీంనగర్ అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి తిరుపతికి రైలు (12762) (ఆది, గురువారం), తిరుపతి నుంచి కరీంనగర్‌కు (12761)(బుధ, శనివారం) రైలు ప్రస్తుతం వారానికి రెండు సార్లు మాత్రమే నడుస్తుందని దీనిని ప్రతి రోజు నడిచేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు లేఖ రాసినట్లు రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రైలును తాను ఎంపీగా ఉన్నప్పుడు ఉత్తర తెలంగాణ ప్రజలు తిరుపతి వెళ్లడానికి సులభతరంగా ఉంటుందని యూపీఏ ప్రభుత్వంలో ప్రారంభించామని తెలిపారు. దీనిపై బీజేపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి 10 సంవత్సరాలుగా రైల్వే శాఖ మంత్రిగా మీకు, స్థానిక ఎంపీ బండి సంజయ్‌కి విజ్ఞప్తి చేస్తున్నానని లేఖలో పేర్కొన్నారు. ఉత్తర తెలంగాణ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణికులకు అనుకూలంగా కరీంనగర్ నుంచి నిత్యం రైలు నడిపించాలని కోరారు.

అంజన్న సన్నిధిలో భక్తుల రద్దీ



అంజన్నను దర్శించుకుంటున్న భక్తులు

మల్యాల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచే భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముని ఆలయంలో పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు. కాగ శనివారం యూట్యూబర్ సదన్న కుటుంబ సమేతంగా అంజనేయస్వామిని దర్శించుకొని పూజలు చేశారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు ఆలయంలో జరిగే పవిత్రోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ జరుగనున్నట్లు ఆలయ అధికారులు, అర్చకులు తెలిపారు. ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు

ధర్మపురిలో బ్రహ్మోత్సవాలకు మంత్రులకు ఆహ్వానం

ధర్మపురి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలో సోమవారం నుంచి ఈ నెల 22 వరకు జరిగే లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లను ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ శనివారం ఆహ్వానించారు. హైదరాబాద్‌లో ఇద్దరు మంత్రులను ఆయన వేర్వేరుగా కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. అనంతరం వారిద్దరికీ స్వామి శేష వస్త్రంతో సత్కరించారు. మంత్రులు ఉత్సవాలకు హాజరవుతామని హామీ ఇచ్చినట్లు ఆలయ ఈవో తెలిపారు. వారి వెంట ఆలయ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, వినయ్, సిబ్బంది పాల్గొన్నారు.





రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్‌లకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న ధర్మపురి ఆలయ ఈవో శ్రీనివాస్, సిబ్బంది

వంతెన పూర్తి చేయాలని యువకుల నిరసన

ఇల్లంతకుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అనంతారం గ్రామ సమీపంలోని బిక్కవాగు వంతెనపై శనివారం యువకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువజన నాయకుడు అక్కెం నాగరాజు మాట్లాడుతూ 2017లో ప్రారంభించిన వంతెన ఇంతవరకు పూర్తికాలేదన్నారు. అసంపూర్తిగా ఉన్న వంతెన వల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన దారి కావడం నిత్యం వందలాది వాహనాలు వెళ్తున్నందున ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. వంతెనపై యువకుల నిరసనతో వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ యువకులకు నచ్చజెప్పడంతో శాంతించి నిరసన విరమించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, రాజు, చింటు, భాస్కర్, అంజి, విన్ను, కిరణ్, హరి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

బీమా.. జీవితానికి ధీమా

● పేదల కోసం కేంద్ర ప్రభుత్వ పథకాలు

రాయికల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): దేశంలోని పేదలకు సామాజిక భద్రత కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల ద్వారా పలు బీమా ప్రయోజన పథకాలు ప్రవేశపెట్టింది. పథకాలు ప్రచార లోపంతో పేదల దరికి చేరడం లేదు. కనీస బీమా సౌకర్యంతో పాటు వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా పించన్ వచ్చేలా పలు పథకాలు ప్రవేశపెట్టింది. ప్రతి బ్యాంక్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రారంభించారు. ఖాతాదారులకు అవగాహన లేకపోవడం, ప్రచార లోపంతో వాటిని పొందలేకపోతున్నారు.

● **జన్‌ధన్ యోజన**

ప్రధాన మంత్రి జన్‌ధన్ యోజన పథకం ద్వారా దేశంలోని ప్రతి వ్యక్తి జీరో ఖాతా పొందాలి. డబ్బు జమ చేయకుండానే ఈ ఖాతా తీయవచ్చు. ఖాతాదారునికి రూపే డెబిట్ కార్డుతో పాటు లావాదేవీలకు అనుగుణంగా రూ.5 వేల ఓవర్ డ్రాఫ్ట్ సౌకర్యం ఉంటుంది.

● **ప్రధాన మంత్రి జీవన బీమా యోజన**

ప్రధాన మంత్రి జీవన బీమా యోజన పథకంలో భాగంగా ఖాతాదారులు యేటా రూ.330 ప్రీమియంగా చెల్లిస్తే సహజ మరణానికి రూ.2 లక్షల వరకు బీమా వర్తిస్తుంది. పాలసీదారుడు ప్రమాదవశాత్తు మృతి చెందినా, గాయపడినా బీమా వర్తిస్తుంది. ఖాతాదారుడు చేరిన నాటి నుంచి యేటా వారి ఖాతా నుంచి ప్రీమియం మినహాయించుకుంటారు. 18 ఏళ్ల నుంచి 50 ఏళ్ల వయస్సు ఖాతాదారులు ఇందులో చేరవచ్చు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15,42,047 వరకు అర్హులు ఉండగా, ఇప్పటివరకు కేవలం 5,28,113 మంది మాత్రమే ఈ పథకంలో చేరారు.



● **జీవన జ్యోతి సురక్షా బీమా యోజన**

యేటా రూ.12 ప్రీమియంతో జీవనజ్యోతి సురక్షా బీమా యోజన అందుబాటులో ఉంది. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్ల వృద్ధులు సైతం ఈ పథకం ద్వారా బీమా చేసుకోవచ్చు. ఈ పథకం ద్వారా రూ.2 లక్షల ప్రమాద బీమా లభిస్తుంది. ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు 5,13,595 ప్రీమియందారులు ఉన్నారు.

● **అటల్ పింఛన్ యోజన**

కార్మికులకు, ప్రైవేట్, ఇతర ఉద్యోగాలు చేసేవారికి వృద్ధాప్యంలో ప్రయోజనకరంగా పింఛన్ వచ్చే పథకం 18 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వరకు ప్రతి ఏడాది వారి వయస్సును బట్టి రూ.2 నుంచి రూ.105 వరకు విడతలవారీగా ప్రీమియం చెల్లించాలి. జిల్లాలో ఇప్పటివరకు 9 వేల మంది ఇందులో చేరారు. ఈ పింఛన్ పథకంలో ప్రీమియందారుడు మృతి చెందితే చెల్లించిన ప్రీమియం వడ్డీతో సహా కుటుంబ సభ్యులకు అందజేస్తారు.

ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు

నరేష్, యూనియన్ బ్యాంక్ మేనేజర్, రాయికల్



అన్ని బ్యాంకుల్లో ఖాతాదారులు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకుంటే ఈ పథకం వెంటనే అమలులోకి వస్తుంది. ఈ పథకాలకు చివరి తేదీ లేదు. పథకాలపై ఖాతాదారులందరికీ అవగాహన కల్పిస్తున్నాం.

ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ముగ్గురికి విశిష్ట పురస్కారాలు ప్రదానం



పురస్కారాలు అందుకున్న మహిళలు

కరీంనగర్ కల్చరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శనివారం ముగ్గురు మహిళలకు విశిష్ట పురస్కారాలు ప్రదానం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ఆత్మకూరుకు చెందిన రచయిత్రి తంగెళ్ల శ్రీదేవీరెడ్డి, నల్గొండకు చెందిన నృత్య కళాకారిణి, నాగదుర్గ నృత్యాలయ వ్యవస్థాపకురాలు గుత్తా నాగదుర్గ, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం బొడిగేపల్లికి చెందిన జానపద గాయని గొట్టె కనకవ్వకు ఆర్డీవో కుందారపు మహేశ్వర్ తదితరులు పురస్కారాలు అందించారు. కఫిసో అధ్యక్షుడు డాక్టర్ పొన్నం రవిచంద్ర అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి లక్ష్మీగౌతమ్, ఫెస్టివల్ కో ఆర్డినేటర్ ముపెల్లి ఫణిత, సుష్మారెడ్డి, యాగండ్ల అనిల్‌కుమార్, మాడిశెట్టి గోపాల్, కోల రామచంద్రారెడ్డి, శంకరయ్య, సదాశ్రీ, గాజోజు నాగభూషణం, పీఎస్ రవీంద్ర, సురేశ్, అశోక్‌రావు, చంద్రమౌళి, చక్రధర్‌రావు, రమేశ్, ప్రసాద్, సంపత్, కృపాదానం, జీఎస్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

మహిళా దినోత్సవంలో పలువురు వక్తలు


సిరిసిల్లలో కేక్ కట్ చేస్తున్న వైద్యురాలు, మహిళా కండక్టర్లు


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న వనిత, సభ్యులు


టీజీటీటీఎఫ్ ఆధ్వర్యంలో..


వేములవాడలో కేక్‌కట్ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి

సిరిసిల్ల టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రభుత్వ ప్రధాన వైద్యశాల వైద్యురాలు ఏ మాధవి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం కొత్తబస్టాండ్ ప్రయాణ ప్రాంగణంలో సిరిసిల్ల ఆర్టీసీ డిపో మేనేజర్ ప్రకాష్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథి ప్రభుత్వ ప్రధాన వైద్యశాల వైద్యురాలు మాధవి, మహిళ కండక్టర్లు కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. వైద్యురాలు మాధవి, డిపో మేనేజర్ ప్రకాష్, ట్రాఫిక్ సూపర్‌వైజర్ వర్షిలాల్, సిబ్బంది, మల్లేశం, శ్రీనివాస్ శేఖర్, కృష్ణరెడ్డి, గార్డు జోత్స్న, మహిళా కండక్టర్లు పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో పారిశుధ్య కార్మికులుగా పని చేస్తున్న మహిళలను, ఏడు పదుల వయస్సులో కూడా అథ్లెటిక్స్ పరుగు పందెల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తున్న తమటం రామానుజమ్మను సన్మానించారు. మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, కాంగ్రెస్ మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, పట్టణఅధ్యక్షురాలు రోజా, నాయకురాలు కోడం సుధా రమాదేవి, లత, మంజుల తదితరులు పాల్గొన్నారు.

● సిరిసిల్ల రూరల్ : సిరిసిల్ల పట్టణంలోని మాస్టర్ మైండ్స్ స్కూల్స్ యాజమాన్యం నిర్వహించిన వేడుకల్లో మాస్టర్ మైండ్స్ అకాడమీ డైరెక్టర్ లావణ్య లావణ్య పాల్గొని కేక్‌ను కట్‌చేసి మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం వేద మంత్రాలతో విద్యార్థులు వారి తల్లులకు పాదాభివందనం చేయగా చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమాల్లో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిరిసిల పటణం బీవైనగర్‌లోని అమృత్‌లాల్ శుక్లా భవనంలో ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. అనంతరం ఐద్వా జిల్లా అధ్యక్షురాలు సూరం పద్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో విమల మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లాకార్యదర్శి మూషం రమేష్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు అరుణ్‌కుమార్, సీఐటీయూ నాయకులు మిట్టపల్లి రాజమల్లు, జిందం కమలాకర్, నక్క దేవదాస్, మహిళ నాయకురాళ్లు రైసా బేగం, కొక్కుల యశోధ, సబ్బని శాంతమ్మ, బోడ శ్యామల, చౌరీ కల్పన, సుజాత, అరుణ, సౌమ్య, కోడం లక్ష్మీ పాల్గొన్నారు.

సిరిసిల్ల పట్టణంలో తెలంగాణ ట్రైబల్‌టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. పట్టణంలోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో మహిళా ఉపాధ్యాయులతోపాటు మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ ట్రైబల్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లకావత్ శర్మన్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు అజ్మీర మదన్‌లాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య హాజ్‌నాయక్, జిల్లా మహిళ అధ్యక్షురాలు భూక్య శైలజా, జిల్లా ప్రధాన కార్యదర్శి కంది శిరీష, ఇస్తావత్ భూపతి, భూక్యసతీష్, భూక్యరాజు,, మాలోతు జలపతి, గుగులోత్ రమేష్, అజ్మీర మోహన్, మాలోతు కర్తీలాల్, బానోత్ గణేష్ పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండలంలో ప్రపంచ మహిళాదినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని వాణీనికేతన్ హైస్కూల్, పోలీస్‌స్టేషన్, పొత్తూరు గ్రామంలోని వివేకానంద పాఠశాలలో శనివారం మహిళలను ఘనంగా సత్కరించారు. పాఠశాలలో విద్యార్థుల తల్లులకు ఆటలపోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, ఎంఈవో శ్రీనివాసగౌడ్, పాఠశాల ప్రిన్సిపాల్స్ తూముకుంట శ్రీనిధి, పండరీనాథ్, మధూకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట : మండల కేంద్రంతో పాటు రాజన్నపేట, నారాయణపూర్, అల్మాస్‌పూర్, దుమాల, హరిదాస్‌నగర్, తదితర గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో పారిశుధ్య మహిళా కార్మికులు, సిబ్బందిని సన్మానించారు. ఎల్లారెడ్డిపేటకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు గంభీరావుపేటలోని మా వృద్ధాశ్రమానికి తరలి వెళ్లి వేడుకలను జరిపించారు. పండ్లు పంపిణీ చేశారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్మికులను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు. పంచాయతీ కార్యదర్శులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులున్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఆశా వర్కర్లకు జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు, కోనరావుపేట మాజీ జడ్పీటీసీ పల్లం అన్నపూర్ణ శనివారం చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, నాయకులు జితేందర్ రెడ్డి, తీగల రవీందర్ గౌడ్, సురేష్ గౌడ్, తీగల విజయ, వెంకటి, తిరుపతి, శేఖర్, పాక మహేష్, సురేష్, తిరుపతి, విజయ్, శంకర్, రాకేష్, సాయికృష్ణ, వేణు, అనిష్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్) : తంగళ్ళపల్లి మండలం సారంపల్లి గ్రామంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. గ్రామపంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను కాంగ్రెస్ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి షమీర్, యువజనకాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు మునిగెల రాజు, మానవ హక్కుల యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్‌గౌడ్, ఎండీ హనీఫ్, సుంచుల కిషన్, సిరిసిల్ల దేవదాస్, గడ్డమీది శ్రీనివాస్, మధు, తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై సిరిసిల్ల అశోక్ ఆధ్వర్యంలో పోలీస్‌స్టేషన్లోని మహిళా కానిస్టేబుల్‌ను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ మజీద్ హెడ్ కానిస్టేబుల్ ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలోని మా అనాథ వృద్ధాశ్రమంలో శనివారం మహిళ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎల్లారెడ్డిపేట అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని వృద్ధులకు సబ్బులు, బిస్కెట్లు, పండ్లు, నిత్యవసర సరుకులు అందజేశారు. ఎల్లారెడ్డిపేట అంగన్‌వాడీ టీచర్లకు వృద్ధాశ్రమ నిర్వాకులు మల్లుగారి నర్సాగౌడ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనాద వృద్ధులకు సేవలు అందిస్తున్న నిర్వాహకులు నర్సాగౌడ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట అంగన్‌వాడీ టీచర్లు నర్మద, కవిత, సులోచన, సునీత తదితరులు ఉన్నారు.

గంభీరావుపేట మండలంలోని సముద్రలింగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. సావిత్రీబాయి పూలే, భీమాబాయి అంబేడ్కర్, జాన్సీ లక్ష్మీబాయి, రాణీ రుద్రమదేవి, సమ్మక్క సారలమ్మ, పులాన్‌దేవి, సాకలి ఐలమ్మ వంటి ఎందరో అమరులైన వీరనారీ మణులు అన్యాయాన్ని ఎదిరించి చరిత్రలో నిలిచిపోయారని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి, మహిళలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రామచంద్రం, సీనియర్ నాయకులు కిషన్‌గౌడ్, మాజీ సర్పంచ్ భూమరాజం, మాజీ ఎంపీటీసీ పర్శరాములు, నాయకులు వేణు, మల్లేశం, విజయ్ గ్రామ మహిళ సంఘాలు మహిళలు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : మహిళ దినోత్సవ వేడుకలను వేములవాడ పట్టణంతో మండలాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. వేములవాడ కోర్టు ఆవరణలో జూనియర్ సివిల్ జడ్జి జ్యోతిర్మయి మహిళ న్యాయవాదులతో కలిసి మహిళ కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని సూచించారు.

కాగా వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ ఎస్సై రమేష్‌తో కలిసి పట్టణ పోలీస్ స్టేషన్‌లోని మహిళ పోలీసులను ఘనంగా సన్మానించారు. వేములవాడ ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ పెంచలయ్య ఆధ్వర్యంలో ఆసుపత్రిలోని మహిళ వైద్యులను, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. వారి వెంట వైద్యుల రవీందర్, అనిల్ తదితరులు ఉన్నారు.

అలాగే బీజేపి జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ రాజన్న ఆలయం ఎదుట చిరు వ్యాపారులను శాలువాతో ఘనంగా సన్మానించారు.


ఎల్లారెడ్డిపేటలో..


చిరవ్యాపారులను సన్మానిస్తున్న ప్రతాప రామకృష్ణ


మహిళా పోలీసులను సన్మానిస్తున్న టౌన్‌సీఐ వీర ప్రసాద్

జోరుగా గుట్కా దందా..

(5వ పేజీ తరువాయి)

అరెస్ట్ చేసి 56.36 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. 2022లో 16 కేసుల్లో 51 మందిని అరెస్ట్ చేసి 35 కిలోల 9 గ్రాములు స్వాధీనం చేసుకున్నారు. 2023లో 61 కేసుల్లో 141 మందిని అరెస్ట్ చేసి 71 కిలోల 794 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గత సంవత్సరం 2024లో 93 కేసుల్లో 211 మందిని అరెస్ట్ చేసి 41 కిలోల 272 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి 141 హిస్టరీ షీట్స్ ఓపెన్ చేశారు. ఈ సంవత్సరం ఇప్పటికి 22 కేసుల్లో 48 మందిని అరెస్ట్ చేసి 2 కిలోల 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

బీసీ సాధికారితే లక్ష్యం..

సిరిసిల్ల టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : బీసీ సాధికారితే తమ లక్ష్యం అని బీసీ సాధికారత సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల బాలయ్య అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణంలో బీసీ సాధికారత సంఘం ముఖ్య నాయకుల సమావేశ జరిగింది. అనంతరం విలేకరులతో బాలయ్య మాట్లాడారు. బీసీల అభ్యున్నతే ధ్యేయంగా బీసీ సాధికారత సంఘం పనిచేస్తుందన్నారు. సంఘం విస్తరణలో భాగంగా సిరిసిల్ల పట్టణ కమిటి, మహిళ కమిటి, యువజన కమిటిలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. మార్చి 10న సిరిసిల్ల పట్టణం శాంతినగర్‌లో బీసీ సాధికారత సంఘం జిల్లా కార్యాలయంను ప్రారంభించుకోబోతున్నామని అన్నారు. అదే రోజు కమిటీ సభ్యులను ప్రకటించి వారికి నియామక పత్రాలను కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా సంఘం గౌరవ అధ్యక్షుడు కొండ దేవయ్య, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు పొలాస నరేందర్ హాజరు అవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సాధికారత సంఘం జిల్లా నాయకులు తీగల శేఖర్‌గౌడ్, గోశిక శ్రీనివాస్, గుజ్జె శివరాం, అన్నారపు వేణుగోపాల్ పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘాల సభ్యత్వాల నమోదు

సిరిసిల్ల, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పద్మశాలీ సంఘం, మహిళ యువజన సంఘాల సభ్యత్వాల నమోదు కార్యక్రమాన్ని శనివారం పద్మశాలీ సంఘం కార్యాలయంలో అధ్యక్షులు గోలి వెంకటరమణ, కార్యదర్శి మండల సత్యంలు ప్రారంభించారు. సభ్యత్వాల స్వీకరణ ఈ నెల 26 వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని వారు తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

సిరిసిల్ల టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రక్షణ సమితి(డెమోక్రటిక్) పార్టీని రాష్ట్ర వ్యాప్తంగా బలోపేతం చేయడానికి కృషి చేయాలని రాష్ట్ర అధ్యక్షుడు నరాల సత్యనారాయణ అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్ క్లబ్‌లో పార్టీ జిల్లా ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీఆర్ఎస్(డీ) జిల్లా అధ్యక్షుడిగా గుంటుక సంపత్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ నియామక పత్రం అందించి అభినందించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ తెలంగాణలోని 33 జిల్లాల్లో పార్టీ బలోపేతానికి సన్నద్ధం కావాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సంపత్ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం తనపై నమ్మకంతో బాధ్యతలను అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని 13 మండలాలలో అన్ని కమిటీలు, జిల్లావ్యాప్తంగా సభ్యత నమోదు కార్యక్రమాలను చేపడుతామన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్(డీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శంకర్‌గౌడ్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడు ఆనంద్‌బాబు, యూత్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నర్సింగ్, నాయకులు జైపాల్‌రెడ్డి, అశోక్, రమేష్ పాల్గొన్నారు.

బ్లూకోల్ట్స్ విధుల్లో మహిళా పోలీసులు

వేములవాడ రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళల్లో నూతనోత్తేజం, ధైర్యం నింపేందుకు పోలీసులు సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు వేములవాడ రూరల్ ఎస్సై మారుతి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం వేములవాడ రూరల్ మహిళా సిబ్బంది లహరి ప్రియా, స్వరూప బ్లూకోల్ట్స్ విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విధులు నిర్వహిస్తూ మహిళల్లో ధైర్యాన్ని నింపే దిశగా మహిళా పోలీసు సిబ్బంది పని చేస్తున్నారని తెలిపారు.

వార్షికోత్సవ హంగామా..


నృత్యం చేస్తున్న చిన్నారులు

సిరిసిల్ల రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని చైతన్య భారత్ స్కూల్ యాజమాన్యం నిర్వహించిన చూకీ బూగీలో చిన్నారుల నృత్యాలు అకట్టుకున్నాయి. పాఠశాల మూడవ వార్షికోత్సవ వేడుకలను పట్టణంలోని విమల్ సినిమా థియేటర్‌లో శనివారం సాయంత్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ శోభారాణి, లీలాశిరిషలతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్ని చూకీ బూగీ కార్యక్రమాన్ని జ్యోతిప్రజల్వన చేసి ప్రారంభించారు. ఈ వేడుకల్లోనే అంతర్జాతీయ మహిళ దినోత్సవ వేడుకల సందర్భంగా కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులు, చిన్నారులు చేసిన నృత్యాలు, నాటికలు అకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అడెపు రవీందర్, ప్రిన్సిపాల్ అడెపు కళ్యాణి, అడేపు రేవంత్, ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

వైకుంఠ రథం వితరణ


వైకుంఠ రథాన్ని అందజేస్తున్న ఎన్నారై మోహన్

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ ఎన్ఆర్ఐ కుంట మోహన్ తన తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం గ్రామానికి సుమారు రూ.3లక్షల విలువ గల వైకుంఠ రథాన్ని శనివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షులు చింతపంటి రామస్వామి మాట్లాడుతూ గ్రామంలో చనిపోయిన వ్యక్తులను తీసుకెళ్లడానికి ఇబ్బంది అవుతుందని ఎన్ఆర్ఐ మోహన్‌కు తెలుపగా తన తండ్రి మల్లయ్య స్మారకార్థం వైకుంఠ రథాన్ని వితరణ చేశారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జ్యోతి, కుంట మోహన్ కుటుంబ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పట్టు వస్త్రాల సమర్పణ

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం బండపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు కాచర్ల రాజేశ్వర్ రెడ్డి అనే దాత పట్టు వస్త్రాలను స్వామివారికి శనివారం సమర్పించారు. ఈనెల 9వ తేదీ నుండి ప్రారంభమయ్యే బ్రహ్మోత్సవాలకు స్వామివారికి పట్టు వస్త్రాలు పూజారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొండ లక్ష్మణ్, మాజీ సర్పంచ్ గడ్డం కరుణాకర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, అంబాల శ్రీకాంత్ ఆలయ పూజారి శ్రీకాంతచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

16న ఈఎంఆర్ఎస్‌లో ఆరో తరగతి ప్రవేశ పరీక్ష

ఎల్లారెడ్డిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఈనెల 16న ఆరో తరగతి ప్రవేశ పరీక్షను నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ మంజీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని అన్నారు. 16న ఉదయం 10.30గంటల నుంచి 12.30వరకు పరీక్షను నిర్వహించనున్నామని తెలిపారు. మొత్తం 138 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి రెండు గంటల ముందు చేరుకోవాలని ప్రిన్సిపాల్ మంజీద్ కోరారు.

రాయిని చెరువును నీటితో నింపాలి..

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి


రాయిని చెరువును వద్ద రైతులతో మాట్లాడుతున్న గోపి


ఎండిపోయిన రాయిని చెరువు

వీర్నపల్లి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాయిని చెరువును నీటితో నింపాలని బీజేపీ పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి అన్నారు. వీర్నపల్లి మండలం ఉమ్మడి మద్దిమల్ల గ్రామంలో 9వ ప్యాకేజీ పనులు పూర్తికాక ఎండిపోయిన రాయిని చెరువును ఆయకట్టు రైతులు, నాయకులతో కలిసి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించి 9వ ప్యాకేజి పనులను పూర్తి చేయకుండా 11వ ప్యాకేజి నిధులను తీసుకపోయిన నీటితో నింపిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం 9వ ప్యాకేజీ పనులను పూర్తిచేసే వరకు భారతీయ జనతా పార్టీ పోరాటం ఆగదన్నారు.రాయిని చెరువు ఎండిపోవడంతో ఆయకట్టు యాసంగి పంటపొలాలు ఎండిపోతున్నాయన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును కట్టామని గొప్పలు చెప్పుకునే గతంలో షాడో సీఎంగా పనిచేసిన స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్ ఒక్కసారి ఎండిపోయిన రాయిని చెరువును సందర్శించాలన్నారు. రైతులకు సాగునీరు అందించి దాహార్తి తీర్చేందుకు కాళేశ్వరం ప్రాజెక్టుని కట్టలేదని, మా నీళ్లను సిద్దిపేటకు తరలించేందుకే ప్రాజెక్టులు కట్టారని మండిపడ్డారు. మల్కపేట రిజర్వాయర్ నుంచి రాయిని చెరువుకు రావలసిన పైప్ లైన్ పనులు కంచర్ల అటవీ ప్రాంతంలో ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు. పీసీసీ అధ్యక్ష హోదాలో ఎల్లారెడ్డిపేటకు వచ్చిన రేవంత్‌రెడ్డి 9వ ప్యాకేజి పనులు పూర్తి చేస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం మీద ఐదు నెలలు గడుస్తున్నా పనులు ఎందుకు పూర్తి చేయడం లేదన్నారు. కార్యక్రమంలో వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట బిజెపి మండల అధ్యక్షులు లక్పతి నాయక్, పొన్నాల తిరుపతిరెడ్డి, వీర్నపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల ప్రధాన కార్యదర్శి పిట్ల నాగరాజు, చందుపట్ల లక్ష్మారెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మాడ్గుల లక్ష్మీరాజం, దాసరి గణేష్, సందెవేని రాజు, సిరిసిల్ల వంశీ, లింబాద్రి, వెంకటేష్, శ్రీనివాస్, పిర్యా, మోహన్, రైతులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


చందుర్తి ఎస్ఐకి ఫిర్యాదు అందజేస్తున్న దళిత సంఘాల నాయకులు

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం నాగునూరు గ్రామంలో అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసిన దుండగులను శిక్షించాలని చందుర్తి మండల అంబేద్కర్ దళిత సంఘాల నాయకులు చందుర్తి ఎస్ఐకి శనివారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ నాగునూరు గ్రామంలో ఈ నెల 6న రాత్రి సమయంలో భారత రత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేసి అవమానపరచిన దుండగులను వెంటనే అరెస్టు చేసి చట్టా రీత్యా చర్యలు తీసుకొని దేశద్రోహం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం డివిజన్ అధ్యక్షుడు దుమ్మ అంజయ్య, మాల మహానాడు జిల్లా కన్వీనర్ నీరటి శ్రీనివాస్, నాయకులు బత్తుల కమలాకర్, నక్క రాములు, దుమ్మ హన్మంతు, సందరగిరి లక్ష్మణ్, గుడిసె రమేష్, పాటి జ్యోతి కుమార్, నీరటి ప్రసాద్, రాగుల సుబ్రహ్మణ్యం, బత్తుల అశోక్ లు, వివిధ గ్రామాల దళిత నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నర్సింగాపూర్‌లో వైద్య శిబిరం

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం నర్సింగాపూర్ గ్రామంలో సిబిఎస్ వైద్య శిబిరంను పద్మపాని సొసైటీ కరీంనగర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. గ్రామంలోని గ్రామ పంచాయతీ ఆవరణలో సిబిఎస్ హెల్త్ క్యాంప్‌లో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పి ఐశ్వర్య 59 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఏఎన్ఎం రాధిక, ఆశాలు మానస, గంగాజల పద్మపాని సొసైటీ ఎల్ డబ్ల్యూ ఎస్ మెంబర్స్ సంజీవ్, రజిత, నీతూ, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

నియామకం

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండల బీజేవైఎం అధ్యక్షుడిగా మోత్కుపల్లి రాజశేఖర్‌ను, ప్రధాన కార్యదర్శిగా సిరికొండ తిరుపతిలను నియమించినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు మోకిలే విజేందర్ శనివారం తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని విజేందర్ సూచించారు.

మాజీ సర్పంచ్‌ను బెదిరించిన వారిపై చర్యలు తీసుకోవాలి


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

తంగళ్లపల్లి, (సిరిసిల్ల రూరల్) మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం చేపట్టి రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్ పార్టీకి ఎదురులేదని, ఆ పార్టీ నాయకులను కాంగ్రెస్ నాయకులు బెదిరింపులకు గురిచేయడం సరైంది కాదని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న అన్నారు. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు తరలివెళ్లి జిల్లెల్ల మాజీ సర్పంచ్ మాట్ల మధును అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్ఐ రామ్మోహన్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ దళిత వర్గానికి చెందిన మాట్ల మధుకు అర్ధరాత్రి కాంగ్రెస్ నాయకులు ఫోన్ చేసి చెప్పరాని బూతులతో తిట్టడం సిగ్గు చేటన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో పది సంవత్సరాలు అధికారంలో ఉందని ఆ పార్టీలో పనిచేస్తున్న తాము కాంగ్రెస్ నాయకులపై ఎప్పుడు కూడా విమర్శలు చేయలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కావాలని మాపై వ్యక్తిగతంగా టార్గెట్ చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు. మాట్ల మధును ఫోన్‌లో బెదిరించిన కాంగ్రెస్ పార్టీ నాయకున్ని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు, సిరిసిల్ల సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్, సిలివేరి చిరంజీవి, మాట్ల మధు, కొయ్యడ రమేష్, కురుమ రాజయ్య, చంటి, రామిరెడ్డి, కందుకూరి రాములు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సహాయం

రుద్రంగి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రానికి చెందిన పడాల శ్యామ్ అనే యువకుడికి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలయ్యాయి. అయితే శ్యామ్ అనే యువకుడు నిరుపేద కుటుంబానికి చెందడంతో రుద్రంగి కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇప్ప మహేష్ వైద్య ఖర్చులకోసం ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ చెలుకల తిరుపతి, పిడుగు లచ్చిరెడ్డి, ఈర్లం నవీన్ పాల్గొన్నారు.

విరాళాలతో దహన సంస్కారాలు

ఇల్లంతకుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్‌కు చెందిన శీలం రజనీకాంత్ బావిలోపడి మృతిచెందగా విరాళాలతో దహన సంస్కారాలు చేశారు. మాజీ సర్పంచ్ గొడిశెల జితేందర్‌గౌడ్, యువజన నాయకుడు కేతిరెడ్డి నవీన్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్‌లు రేగుల బిక్షపతి, ఎద్దు కుమార్, ముదిరాజ్ సంఘ మండల అధ్యక్షుడు ఎలవేని రమేష్ విరాళాలు అందించారు.

సీసీ రోడ్డుపనులు ప్రారంభం

ఇల్లంతకుంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రహీంఖాన్‌పేటలో సీసీ రోడ్డు పనులను బీజేపీ నాయకులు శనివారం ప్రారంభించారు. సీసీ రోడ్డుకు కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ నిధులు మంజూరుచేయగా గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. బత్తిని స్వామి, బత్తిని సాయగౌడ్, తిప్పారపు శ్రావణ్, వజ్జపల్లి శ్రీకాంత్, చిమ్మనగొట్టు శ్రీనివాస్,సాయిప్రసాద్‌రెడ్డి, వంశీ మాజీ సర్పంచ్ బిళ్ళవేని పర్శరాం ఉన్నారు.

అంజన్నకు ముడుపులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : వడగళ్ల వర్షాల నుంచి పంటలను కాపాడాలని వేడుతూ మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు హన్మండ్ల శర్మ ఆధ్వర్యంలో గణపతి, నవగ్రహ పూజ, స్వామివారికి చందనాభిషేకం తదితర కార్యక్రమాలను జరిపించారు. అంజన్న పంటలను కాపాడాలంటూ ముడుపు వేశారు. కార్యక్రమంలో రైతులు ఎల్లారెడ్డి ,వెంకట్ రెడ్డి, రాం రెడ్డి, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజగోపురం ప్రాణప్రతిష్ఠకు విరాళం

చందుర్తి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాలలోని వెంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం ప్రాణప్రతిష్ఠాపన ఉత్సవానికి గ్రామ అభివృద్ధి కమిటీ దుబాయ్ గ్రూపు సభ్యులు శనివారం విరాళం అందజేశారు. రూ.54 వేలు ఆలయ కమిటీ చైర్మన్ మాదాడి కిషన్‌రావు, ప్రధానార్చకులు కందాలై వెంకటరమణాచార్యులకు అందజేశారు. గ్రూపు ఆర్గనైజర్స్ కొడగంటి గంగాధర్, మాదం బాబు, వివేకానంద సేవ సమితి సభ్యులు లోకోజి సతీష్, పాటి సుధాకర్, పంచర్పుల దివ్యసాగర్, మూడపల్లి ముఖేష్, జాల గంగాధర్, తోట శంకర్, ఏన్నం శ్రీధర్, దురిశెట్టి రాజు, సకినాల గంగాధర్, కోన నరసయ్య, పులి పరుశరాములు, ఆర్సం సతీష్, విజయ్ పాల్గొన్నారు.